www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

## తెలంగాణ దిక్సూచి

శనివారం | 25 | అక్టోబర్ | 2025 | పేజీలు: 08





# ఆరబెట్టుకుని పత్తిని కేంద్రాలకు తేవాలి

**కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**మునుగోడు, అక్షిత ప్రతినిధి :** అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని పత్తి రైతులు రెండు మూడు రోజులు ఆగి పత్తిని ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆమె నల్గొండ జిల్లా, మునుగోడు మండల కేంద్రంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బాలాజీ కాటన్ ఇండస్ట్రీస్ లో ఏర్పాటుచేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షులు కుంభం శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు, మిల్లర్లతో ముఖాముఖి మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా పత్తిని కొనుగోలు చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా ..మిగతా 2లో



# మహా యజ్ఞంగా ఇందిరమ్మ ఇళ్లు

**తల దాచుకునే చోటే కాదు**

**జీవితకాల హరివిల్లు**

**ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**

**గుడిపల్లి/ పెద్దఅడిశర్లపల్లి, అక్షిత ప్రతినిధి :** జనహిత ఎమ్మెల్యే మార్నింగ్ వాక్ విత్ పీపుల్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గుడిపల్లి మండల కేంద్రంలో వివిధ కాలనీలో ప్రజా ప్రతినిధులు,అన్ని శాఖల అధికారులతో కలసి పర్యటించి, స్థానిక ప్రజలకు నేరుగా కలిసి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకొని అక్కడిక్కడే సంబంధిత ..మిగతా 2లో



# పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు

**రైతులకు ఇబ్బందులు తలెత్తొద్దు**

**కలెక్టర్ విజయేందిర బోయి**

**ధాన్యం కొనుగోలుపై శిక్షణ**



**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి :** వానాకాలం సీజన్ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలుపై వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలు, ఐకెపి, ఏపిఎంలు, సిసిలు,ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల మానిటరింగ్ అధికారులు, కార్యదర్శులు, పాయింట్ ఇంచార్జిలు, వ్యవసాయ శాఖ ఏడిలు, ఏఈఓలు, ఏఓలు,రైస్ మిల్లర్ లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ వారం రోజుల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్న దృష్ట్యా కొనుగోలు ..మిగతా 2లో

# చిరకాల వాంఛ...నెరవేరిన వేళ

**ఎమ్మెల్యే మేఘారెడ్డి కృషితో సాకారం**

**జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం**

**సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు తెలిపిన మేఘారెడ్డి**



**వనపర్తి, అక్షిత ప్రతినిధి :** చిరకాల వాంఛ ఎట్టకేలకు నెరవేరింది. కాంగ్రెస్ పార్టీకి స్వంత భవంతి నిర్మించాలనే ఆశ ఫలించింది. ఎన్నో ఏళ్ల నాటి ..మిగతా 2లో



# "చైతన్యం"తో డ్రగ్స్‌కు చెక్

**దుర్గా ఓబి కంపెనీలో "చైతన్యం"**

**మాదక ద్రవ్యాల నిర్మూలనపై కార్మికులతో ప్రతిజ్ఞ,అవగాహన**

**భద్రాద్రి కొత్తగూడెం /అక్షిత ప్రతినిధి :** మాదక ద్రవ్యాల సమూల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా భాగస్వాములవ్వాలని మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి ..మిగతా 2లో

అక్షిత
AKSHITHA NATIONAL DAILY
శనివారం |25| అక్టోబర్ | 2025

## పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు



**మొదటి పేజీ తరువాయి...**

కేంద్రాల ఇంచార్జి లు కొనుగోలు ప్రక్రియలో చేపట్ట వలసిన జాగ్రత్తలు,సూచనలు ఆయా శాఖల అధికారులు తెలిపిన విధంగా తప్పని సరి పాటించాలని కలెక్టర్ సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో నీడ కల్పించేలా టెంట్, త్రాగు నీరు,కనీస సౌకర్యాలు కల్పించాలని అన్నారు. జిల్లాకు 45 ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్ లు వారం రోజుల్లో రానున్నాయని తెలిపారు.రైతులు ఆరబోసి తాలు, లేకుండా నిర్ణీత తేమ శాతం ఉన్న ధాన్యం తీసుకువచ్చేలా నాణ్యతా ప్రమాణాల గురించి వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు.

నాణ్యతా ప్రమాణాలు,నిర్ణీత తేమ శాతం ఉన్న ధాన్యం ను మాత్రమే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రంలో ఎటువంటి ఒత్తిళ్లు లేకుండా రైతులకు నాణ్యత ప్రమాణాలు తేమ శాతం ఉన్న ధాన్యంకు సీనియారిటీ ప్రకారం టోకెన్ లు జారీ చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు చేసిన రైతుకు కొనుగోలు పత్రం జారీ చేయాలని,కొనుగోలు పత్రం తీసుకున్న రైతులు ఎట్టి పరిస్థితుల్లో మిల్లర్ వద్దకు వెళ్లవద్దని తెలిపారు.కొనుగోలు పత్రం లో సూచించిన విధంగా మాత్రమే ధాన్యం ఆలస్యం చేయకుండా మిల్లర్ లు దిగుమతి చేసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు సీజన్ పూర్తి అయ్యే వరకు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, వివిధ శాఖల సిబ్బంది సమన్వయంతో కొనుగోళ్లు ఎటువంటి సమస్యలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. వాతావరణ పరిస్థితులపై రైతులకు వ్యవసాయ అధికారులు తెలియ చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో వర్షంలో ధాన్యం తడవకుండా టార్పాలిన్ లు సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంకు తీసుకు వచ్చిన వెంటనే ఓపిఎంఎస్ లో రైతు వివరాలు అప్ లోడ్ చేయాలని అన్నారు. హార్వెస్టర్ యజమానులతో సమావేశం జరిపి వారికి ఆర్ పిఎం 18 నుండి 19 వరకు ఉండేలా, ఇతర సూచనలు తెలుపాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి అవకతవకలు పాల్పడిన, నిర్లక్ష్యం వహించిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, డిఆర్డిఓ నర్సింహులు, జిల్లా సహకార అధికారి శంకరాచారి,పౌర సరఫరాల సంస్థ డిఎం.రవి నాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేష్,జిల్లా ఉద్యాన శాఖ అధికారి వేణుగోపాల్, జిల్లా మార్కెటింగ్ అధికారి బాలమణి,సహకార ఆడిట్ అధికారి టైటస్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

## చిరకాల వాంఛ... నెరవేరిన వేళ



**మొదటి పేజీ తరువాయి...**

కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయ సొంత భవన నిర్మాణం కల నేడు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవతో

సాకారం అయ్యింది. ఎంతో ఘనచరిత్ర గల కాంగ్రెస్ పార్టీకి ఇప్పటివరకు జిల్లా కార్యాలయం లేకపోవడంతో చలించిపోయిన ఆయన తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన వెంటనే పార్టీ జిల్లా కార్యాలయం నిర్మాణం కోసం స్థల పరిశీలన చేసి సంబంధించిన ప్రతిపాదనలను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి, సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తన అభ్యర్థనకు స్పందిస్తూ వనపర్తి పట్టణ శివారు రాజపేటలోని 73/2 సర్వే నెంబర్ లోని 1 ఎకరం భూమిని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయ నిర్మాణానికి కేటాయిస్తూ క్యాబినెట్ ఆమోదం తెలిపినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.త్వరలోనే 73/2 సర్వే నెంబర్లో గల స్థలంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంకు సంబంధించిన పనులు ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణానికి సంబంధించి సహకరించిన జూపల్లి కృష్ణారావుకి, వాకిటి శ్రీహరికి, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవికి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# మహా యజ్ఞంగా ఇందిరమ్మ ఇళ్లు

**మొదటి పేజీ తరువాయి...**

అధికారులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఎలా అందుతున్నాయో తెలుసుకుంటూ, ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ సాగిన జనహిత యాత్ర.అన్ని విభాగాల అధికారులతో కలిసి ప్రజల వినతులను స్వీకరించి, కొన్ని సమస్యలు అక్కడి అక్కడే పరిష్కరించారు. ప్రజల ప్రేమ, సహకారంతో ప్రజా ప్రభుత్వాన్ని మరింత బలోపేతం చేస్తాం. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు లబ్దిదారులను అధికారులు కానీ ప్రజాప్రతినిధులు డబ్బులు అడిగితే కఠిన చర్యలు తీసుకుంటామని, అలా ఎవరైనా డబ్బులు అడిగితే నేరుగా నాకు ఫోన్ చేయాలని అన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో రూ. 8 లక్షల కోట్ల అప్పు చేశారని, ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా ముందుకెళ్తోందన్నారు. ప్రజాపాలనలో ఆరు గ్యారంటీలకు పెద్దపీట వేసిందన్నారు.ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పర్చడానికి ప్రభుత్వ, సంక్షేమ పథకాలు మాత్రమే సరిపోవని, సామాజిక రుగ్మతలను రూపుమాపినప్పుడే. నవ సమాజం నిర్మితమవుతుందని ఉద్భోదించారు. కార్పొరేట్ చదువులకు, కార్పొరేట్ వైద్యానికి,



ఆడాంబరాలకు పోయి చాలా మంది అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లడం మా ప్రధాన లక్ష్యం. ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలి, ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలి అనేది నా సంకల్పం. దేవరకొండ నియోజకవర్గ ప్రజల నమ్మకానికి తగిన విధంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూ ముందుకు సాగుతున్నాను. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కీ.శే.గున్ రెడ్డి రమణారెడ్డి కళావేదిక ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై, కళావేదికను ప్రారంభించి అనంతరం కళ్యాణ లక్ష్మి మరియు షాది ముబరక్ చెక్కులను స్వయంగా 10 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, మండల ముఖ్య నాయకులు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, యన్ఎస్ యుఐ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరబెట్టుకుని పత్తిని కేంద్రాలకు తేవాలి

**మొదటి పేజీ తరువాయి...**

జిల్లా కలెక్టర్, డిసిసిబి చైర్మన్లు పత్తి తేమ శాతాన్ని పరిశీలించారు. అంతేకాక తూకం యంత్రం ద్వారా తూకాన్ని పరీక్షించారు. తేమ 8 నుండి 12 శాతం లోపు ఉండేవిధంగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కలెక్టర్ రైతులకు చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ మునుగోడు పత్తి కొనుగోలు కేంద్రం అతి ముఖ్యమైందని,ఎల్ 1 సెంటర్ గా ఉన్న ఈ కేంద్రంలో గతంలో రైతులు ఇతర జిల్లాల నుండి పత్తిని తీసుకు వచ్చే వారని, అప్పుడు జిల్లా రైతులు పత్తిని అమ్మడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారని ,ఈ సంవత్సరం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొత్తగా కపాస్ కిసాన్ యాప్ ను ఏర్పాటు చేసిందని, ఈ యాప్ ద్వారా ముందుగా స్లాట్ బుక్ చేసుకున్న రైతుల పత్తి సరైన తేమ శాతంతో ,నాణ్యతా ప్రమాణాలతో ఉంటే అదేరోజు కొనుగోలు చేయడం జరుగుతుందని ఆమె



తెలిపారు. ఒక సీజన్లో రైతు మూడు సార్లు స్లాట్ బుక్ చేసుకోవచ్చని, ఒకవేళ ఏదైనా కారణం చేత బుక్ చేసుకున్న స్లాట్ ను క్యాన్సల్ చేసుకోవచ్చని ,ఆ స్లాట్ అలాగే ఉంటుందని స్పష్టం చేశారు. మునుగోడు కేంద్రంలో 19000 మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేసే సామర్థ్యం ఉన్నందున చుట్టుపక్కల రైతులకు పత్తి అమ్మకంలో ఎలాంటి ఇబ్బందులేదని చెప్పారు. ఈ రెండు మూడు రోజులు రైతులెవరు స్లాట్ ను బుక్ చేసుకోవద్దని, వర్షాలు తగ్గిన తర్వాత స్లాట్ బుక్ చేసుకోవాలని, పత్తిని బాగా ఆరబెట్టి తీసుకురావాలన్నారు. ఒకవేళ వర్షంలో స్లాట్ బుక్ చేసుకుని వస్తే తేమ ఎక్కువ గా ఉంటే తిప్పి పంపే అవకాశం ఉంటుందని, ఈ విషయంలో రైతులు పూర్తిగా సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ,కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారి బాలాజీ నింజె, చండూర్ ఆర్డీవో శ్రీదేవి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ గోపి కృష్ణ, మార్కెటింగ్ ఎడి ఛాయాదేవి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు కలెక్టర్ వెంట ఉన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మునుగోడు మండలం, కచలాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిఖంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రానికి ఇప్పటివరకు వచ్చిన ధాన్యం, అమ్మిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. వర్షాలను దృష్టిలో ఉంచుకొని ధాన్యం తడవకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, రైతులు కొనుగోలు కేంద్రం వద్దే ఉండి ధాన్యాన్ని టార్పాలిన్లతో కప్పి ఉంచాలని చెప్పారు.

# “చైతన్యం”తో డ్రగ్స్‌కు చెక్

**మొదటి పేజీ తరువాయి...**

పిలుపునిచ్చారు. గంజాయి వంటి మత్తు పదార్థాల నిర్మూలనకు చైతన్యం పేరుతో నవంబర్

15 వరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు అవగాహన కార్యక్రమాలు చేపట్టుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో శుక్రవారం దుర్గా ఓబి కంపెనీలో డిఎస్పీ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో “మాదక ద్రవ్యాల నిర్మూలనపై చైతన్యం” అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీలో పనిచేసే కార్మికులతో



మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు. డిఎస్పీ మాట్లాడుతూ, యువత మత్తుకు బానిసలై తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, వారిలో చైతన్యం నింపేందుకు ఈ కార్యక్రమాలను ప్రారంభించామని పేర్కొన్నారు. జిల్లాలోని గంజాయి హాట్స్పాట్లలో నిత్యం తనిఖీలు కొనసాగుతున్నాయని, మత్తు పదార్థాలు వినియోగించే వారిపై కౌన్సిలింగ్ కార్యక్రమాలు కూడా చేపడుతున్నట్లు తెలిపారు. ఎవరైనా నిషేధిత గంజాయి రవాణా, విక్రయం లేదా వినియోగం చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నగేష్, పోలీసు సిబ్బంది, ఓబి కంపెనీ కార్మికులు పాల్గొన్నారు.

# ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

**దశల వారీగా బిల్లుల విడుదల**

**కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వనపర్తి, అక్షిత ప్రతినిధి : ఇందిరమ్మ ఇండ్లకు మంజూరి పత్రాలు అందుకుని ఇంకా ప్రారంభించని వారు త్వరగా ప్రారంభించి, నిర్మాణాలను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ వనపర్తి మండల పరిధిలోని చందాపూర్, చిట్యాల గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లకు మంజూరి పత్రాలు అందుకుని ఇంకా ప్రారంభించని వారు త్వరగా ప్రారంభించి, నిర్మాణాలను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి దశల వారీగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందన్నారు. గ్రౌండింగ్ ప్రారంభించిన ఇళ్లు బెస్‌మెంట్ లెవల్‌కు చేరితే మొదటి విడత చెల్లింపులు జరుగుతుందని అన్నారు. ఏమైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని లబ్ధిదారులకు సూచించారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పేదలకు సొంత ఇంటి కల నెరవేర్చేందుకు 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపడుతోందని, పనులను నాణ్యవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు పర్యవేక్షణను క్రమం తప్పకుండా కొనసాగించాలని కలెక్టర్ అన్నారు. పెండింగ్ లేకుండా లబ్ధిదారులకు నగదు పడే విధంగా చూసుకోవాలని, పెండింగ్ సమస్యలు ఏమైనా ఉంటే నివేదిక సమర్పించాలని కలెక్టర్ సూచించారు. నివేదిక సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే లబ్ధిదారులకు ఇసుకకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.

**గణితంపై ప్రత్యేక తరగతులు**

చందాపూర్ గ్రామ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థుల గణితం మార్కుల నివేదికతో పాటు ఎఫ్ ఆర్ ఎస్ అటెండెన్స్ గురించి ఆరా తీశారు. గణితంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, గృహ నిర్మాణ శాఖ డిఈ విఠోబా, తహసిల్దార్ రమేష్ రెడ్డి, ఎంపీడీవో, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వ విద్యాలయ ఉపకులపతి దండా రాజి రెడ్డికి సన్మానం



రాజేంద్రనగర్ అక్షిత ప్రతినిధి: రాజేంద్రనగర్ శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టి సంవత్సరం కాలం పూర్తిచేసుకున్న విశ్వవిద్యాలయ ఉపకులపతి డా. దండా రాజి రెడ్డి ని విశ్వవిద్యాలయ సిబ్బంది, విద్యార్థులు సన్మానించారు. అలాగే విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థులు ఆయన్ని ఘనంగా సన్మానించారు. వర్సిటీ పూర్వ విద్యార్థి అయినటువంటి డా. కె. మధుసూదన్ రెడ్డి రాసిన 'కంపిల్డ్ వెజిటల్స్ సైన్స్' అనే పుస్తకాన్ని, విశ్వవిద్యాలయ ఉపకులపతి డా. దండా రాజి రెడ్డిచేతుల మీదుగా రిలీజ్ చేసారు. ఈ యొక్క పుస్తకం, ఉద్యాన శాస్త్రం లో ఉన్నత చదువుల కొరకు ఎవరైతే పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతారో వాళ్లకి బాగా ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్క విద్యార్థి కూడా ఇలాగా ప్రతిభని కనబర్చాలని సూచించారు. ఈ కార్యక్రమం లో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. భగవాన్, డీన్ హార్టికల్చర్ డా. చీనా నైక్, ఇతర విశ్వవిద్యాలయ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలీస్ అమర వీరుల త్యాగాలు వృధా కావు

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**



వరంగల్, అక్షిత బ్యూరో: పోలీస్ అమర వీరుల త్యాగాలు వృధా కావని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాలను పురస్కరించుకోని వరంగల్ కమిషనరేట్ కార్యాలయములో రక్తదాన శిబిరాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ శనివారం ప్రారంభించారు.

ఆర్మ్డ్ రిజర్వ్, ట్రాఫిక్,స్థానిక పోలీస్ స్టేషన్ల అధ్వర్యంలో రెడ్ క్రాస్ రక్తనిధి సహకారంతో పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని రాణి రుద్రమదేవి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలీస్ అధికారులు, సిబ్బంది యువతకు స్ఫూర్తి కలిగించే రీతిలో ఈ రక్తదాన శిబిరంలో ముందుగా వరంగల్ పోలీస్ కమిషనర్ స్వచ్ఛందంగా రక్తందానం చేశారు. అనంతరం ఆర్మ్డ్ రిజర్వ్,లా అండ్ ఆర్డర్,ట్రాఫిక్ విభాగాలకు చెందిన పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు స్థానిక యువత, ఆటో డ్రైవర్లు స్వచ్ఛందంగా రక్తదానం చేసారు. ఈ సందర్భంగా స్వచ్ఛందంగా రక్తదానం చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ వ్యక్తిగతంగా కలుసుకోని అభినందించడంతో పాటు వారికి పండ్లు, సర్టిఫికెట్లను అందజేసారు.

అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీసులు కేవలం శాంతి భద్రతలను పరిరక్షించడమే కాదు సేవా కార్యక్రమాల్లోను ముందు వరసలో వుంటారని, ముఖ్యంగా రక్తదానంపై వున్న అపోహలను నమ్మకుండా ప్రతి ఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని, పోలీస్ సిబ్బంది తమ వ్యక్తిగత ఆరోగ్యం పట్ల దృష్టి పెట్టాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో డిసిపి అంకిత్ కుమార్ , అదనపు డిసిపిలు రవి, సురేష్ కుమార్, శ్రీనివాస్,ఏసీపీలు అనంతయ్య, సురేంద్ర, సత్యనారాయణ,నాగయ్య, జాన్ నర్సింహులు, జితేందర్ రెడ్డి,ఆర్.ఐలు సతీష్, శ్రీధర్, చంద్రశేకర్, శ్రీనివాస్,స్పర్జన్, రాజ్, హన్మకొండ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు డా. విజయ్ చందర్ రెడ్డి, ఇ. వి శ్రీనివాస్ రావు, రమణ రెడ్డితో పాటు పోలీస్ యూనిట్ వైద్యులు, ఇతర పోలీస్ అధికారులు, పరిపాలన,రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో గగన్ పహాడ్లో సిసి రోడ్డు పనులు ప్రారంభం



రాజేంద్రనగర్ అక్షిత ప్రతినిధి: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్ దేవుపల్లి డివిజన్ లో గల గగన్పహాడ్ బస్తీలో నూతన సిసి రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్ ధనంజయ్ మాట్లాడుతూ గత కొంతకాలంగా గగన్ పహాడ్ దళిత బస్తీలో సరైన రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో బస్తీ వాసులందరికీ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని పేర్కొన్నారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ వెంటనే జిహెచ్ఎంసి అధికారులతో మాట్లాడి సిసి రోడ్డుకు అవసరమైన నిధులను మంజూరు చేయించారని పేర్కొన్నారు. సీసీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు కావడంతో గగన్ పహాడ్ బస్తీలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించడం జరిగిందని ధనుంజయ్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే చొరవతో గగన్ పహాడ్ బస్తీలోని దళితవాడలో రోడ్డు సమస్యలకు పరిష్కారం లభించిందని ఆయనే సందర్భంగా పేర్కొన్నారు. తమ విన్నపం మేరకు సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే నిధులు మంజూరు చేయించి రోడ్డు పడేలా కృషి చేసిన ఎమ్మెల్యేకు బస్తివాసులంతా ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారత్ యూత్ క్లబ్ నాయకులు బి లక్ష్మణ్, మంచర్ల శ్రీనివాస్, ఈ యాదయ్య, ఎల్లయ్య,జోగి శేఖర్, రత్నం, శివ, జే.శ్రీనివాస్, ఆనంద్, చిన్న,విజయ్, సురేందర్, దయానంద్, అజయ్,చింటూ తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ సర్కిల్‌లో తెలంగాణ 'ఇందిరా మహిళా శక్తి' క్యాంటీన్ల ప్రారంభం



రాజేంద్రనగర్ అక్షిత ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాంటీన్లను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ గారు ప్రారంభించారు. ఆరంఘర్ బస్ స్టాప్, కాటేదాన్ సిటిజెన్ కంటా వద్ద వాటిని ప్రారంభించడం జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఈ క్యాంటీన్లలో ప్రతిరోజూ ఉదయం అల్పాహారము అందించబడుతుందని వీటి నిర్వహణ హరే రామ హరే కృష్ణ ట్రస్ట్ వారి సహకారంతో నిర్వహించబడుతున్నాయన్నారు. మహిళా స్వయం సహాయక బృందాలకు ఉపాధి కల్పించడంలో, ప్రజలకు తక్కువ ధరలో ఆహారం అందించడంలో ఈ క్యాంటీన్లు కీలకపాత్ర పోషించనున్నాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ ప్రెసిడెంట్ ఎన్, ధనుంజయ ఎస్, వెంకటేష్,ఎం వెంకటేష్, కే యాదగిరి, బొల్లా వెంకటేష్, ఓం ప్రకాష్, లక్ష్మారెడ్డి, భాష శ్రీనివాస్, గట్టయ్య, గోపి, బాబురావు, అనిల్, జగదీష్, శ్రీనివాస్, రాము శేఖర్ కె ఎస్ రెడ్డి పడమటి శ్రీధర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆదర్శ ప్రాయుడు భగీరథుడు

### నాకు భగీరథుడే ఆదర్శం

### ఎమ్మెల్యే మేఘారెడ్డి

### పెద్దమందడిలో భగీరథుడి విగ్రహం ఆవిష్కరించిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి, అక్షిత ప్రతినిధి :** పట్టుదలలో భగీరథుడే ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయంగా ఉండాలని నేను ఎల్లవేళలా భగీరథ మహర్షినే ఆదర్శంగా తీసుకుంటానని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన భగీరథుడి విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సగరుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పాటుబడి ఉందన్నారు.దేశంలో ఎక్కడా లేనివిధంగా బీసీ రిజర్వేషన్ తెలంగాణలో అమలుపరిచి దేశానికే రోల్డ్ మాడల్ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి నిలిచారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రిజర్వేషన్ల ప్రకారం సగరులకు అవకాశం ఉన్నచోట గుర్తింపుని ఇస్తామన్నారు. పెద్దమందడి మండల కేంద్రంలో 20 లక్షల రూపాయలతో సగరుల సామూహిక భవనాన్ని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సగర సంగం రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి ఫారెస్ట్ మీటింగ్ హాల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం

### సత్తుపల్లి ఎఫ్ ఆర్ ఓ చేత ప్రారంభం



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణంలో స్థానిక ఫారెస్ట్ మీటింగ్ హాల్లో శరత్ మ్యాక్స్ విజన్ కంటి ఆసుపత్రి ఖమ్మం వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. సత్తుపల్లి రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ పి. స్నేహలత ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం 10:00 నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి కంటికి సంబంధించిన సమస్యలను పరీక్షలు నిర్వహించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు ఆప్తమెట్రిస్ట్ డాక్టర్ వినీల, కోఆర్డినేటర్ విక్రమ్ సింగ్,కౌన్సిలర్ శ్రీకాంత్, టెక్నీషియన్ సందీప్ శరత్ మ్యాక్స్ విజన్ కంటి ఆసుపత్రి సిబ్బంది,ఫారెస్ట్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యం ప్రభుత్వ ప్రాధాన్యం

### కలెక్టర్ పర్యటనలో స్పష్టమైన సందేశం



**భద్రాద్రి కొత్తగూడెం/ అక్షిత ప్రతినిధి:** జిల్లా వ్యాప్తంగా ప్రజలకు సకాలంలో, సమర్థవంతమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రాధాన్య లక్ష్యమని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. నవంబర్ 1 నుండి 7 వరకు జరగనున్న జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్ హెచ్ ఎం) వారోత్సవానికి ముందుగా, కేంద్ర జాతీయ ఆరోగ్య మిషన్ బృందం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో, ఏర్పాట్లను సమీక్షించేందుకు కలెక్టర్ శుక్రవారం పలు ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. కలెక్టర్ రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చాతకొండ పల్లె దవాఖాన, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను పరిశీలించి, వైద్య సిబ్బంది హాజరు, ఔషధ నిల్వలు, శుభ్రత, శానిటేషన్, టీకా కార్యక్రమాల పురోగతి, గర్భిణీ స్త్రీలు మరియు శిశువులకు అందిస్తున్న సేవలు వంటి అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రసూతి గది, ఔషధ నిల్వ గది, ల్యాబ్, అవుట్‌పేషెంట్ విభాగం, శానిటేషన్ విభాగం, రోగుల వేటింగ్ హాల్స్ తదితర విభాగాలను పరిశీలించి, ఆరోగ్య కేంద్రాల ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉంచాలని, రోగులకు అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ, "జిల్లాలోని అన్ని ఆసుపత్రులు, బస్తీ దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మరియు ఆయుష్మాన్ కేంద్రాలు పూర్తి సిద్ధతతో ఉండాలి. ప్రజలకు సమయపాలనతో కూడిన వైద్య సేవలు అందించడంలో ప్రతి వైద్యుడు, సిబ్బంది తమ వంతు బాధ్యతగా వ్యవహరించాలి," అని సూచించారు. అలాగే, ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు పేద,మధ్యతరగతి కుటుంబాలకు అందేలా గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఆసుపత్రి ప్రాంగణాల్లో శుభ్రత, పచ్చదనం, బయో వ్యర్థాల సరైన నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని హెచ్చరించారు. జిల్లాలో ఆరోగ్య సేవల నాణ్యత పెంపొందించడం తమ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. కేంద్ర జాతీయ ఆరోగ్య మిషన్ బృందం పర్యటన విజయవంతం కావడానికి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ పర్యటనలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయలక్ష్మి, వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు

# సీసీ రోడ్డు వేశారు.. మట్టి పోయడం మరిచారు

### రోడ్డు దిగాలంటే ఇబ్బందులు

### మట్టి పోయాలని డిమాండ్ చేస్తున్న స్థానికులు



**ఆత్మకూర్ (ఎం) /అక్షిత న్యూస్:** సీసీ రోడ్ల నిర్మాణం తర్వాత పక్కన మట్టిని వేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు, ఇందుకు నిదర్శనమే ఆత్మకూరు మండల కేంద్రంలో ప్రధాన రహదారి నుండి జిల్లా పరిషత్ హైస్కూల్ వరకు డబల్ రోడ్డు సెంట్రల్ లైటింగ్ తో నిర్మించారు. కానీ రోడ్డు సైడ్ బర్మ్ చేయకపోవడంతో దీనివల్ల రోడ్డుకు ఇరువైపులా ఎత్తుగా ఖాళీ ఏర్పడి, ప్రజలు, వాహనదారులు జారి పడుతున్నారు,వర్షాకాలంలో ఈ ఖాళీల్లో నీరు నిలిచిపోయి మరింత ప్రమాదం ఏర్పడుతుంది,ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు,

**నిబంధనలు గాలికి..ఇష్టారాజ్యంగా పనులు**

ఈ రోడ్ల నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే సైడ్ బర్మ్ పూర్తి చేయాలని, నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఇందుకు విరుద్ధంగా గుత్తేదారులు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గుతేదారులు సిసి రోడ్డు నిర్మించి చేతులు దులుపుకుంటున్నారని పలువురు మండిపడుతున్నారు,తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం ఆర్జించాలనే భావనతో పనులు చేపడుతున్నారని, చేసిన పనులు పరిశీలిస్తే స్పష్టమవుతుందని పలువురు సామాజిక కార్యకర్తలు పేర్కొంటున్నారు,హడావుడి పనులతో రెండు నెలల క్రితం నిర్మించిన రహదారులు నిర్మాణ పనులు దగ్గరుండి పర్యవేక్షించాల్సిన సంబంధిత యంత్రాంగం కూడా చోద్యం చూస్తుండటం పట్ల తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి...

# సత్తుపల్లిలో నిరుద్యోగ యువతకు 26న మెగా జాబ్ మేళా



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణంలో స్థానిక రాణి సెలబ్రేషన్స్, వేంసూర్ రోడ్, సత్తుపల్లిలో 26 అక్టోబర్ 2025 వ తేదీ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సత్తుపల్లి ఎమ్మెల్యే

డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ ల ఆధ్వర్యంలో సింగరేణి కాలరీస్ లిమిటెడ్ (ఎస్.సి.సి.ఎల్) సహకారంతో, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టిఎఎస్.కె) సంయుక్తంగా చదువుకున్న యువత కోసం మెగా జాబ్ మేళా నిర్వహించబడుతోంది.ఈ మెగా జాబ్ మేళాలో సుమారు 3,000%-%4,000 మంది నిరుద్యోగ యువత పాల్గొననున్నారు.

హైదరాబాద్ నుండి 50 కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొని ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయి.మేగా జాబ్ మేళాకు ముందు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సూచించినట్లుగా అక్టోబర్ 25 తేదీలో జాబ్ మేళాలో పాల్గొనబోయే విద్యార్థులు మరియు నిరుద్యోగ యువత కోసం కెరీర్ అవగాహన,ఇంటర్వ్యూ స్కిల్స్ ,రెజ్యూమ్ ప్రిపరేషన్,పర్సనాలిటీ డెవలప్మెంట్ వంటి వాటిపై ప్రత్యేక శిక్షణ సెషన్లు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు, సత్తుపల్లి నందు నిర్వహించబడతాయి. దయచేసి చదువుకున్న యువత అందుబాటులో ఉన్న ఈ మూడు రోజులలో ఒక రోజు శిక్షణ కు హాజరై మీ స్కిల్స్ ను పెంచుకొని 26 న జాబ్ మేళాకు హాజరుకాగలరు. ట్రైనింగ్ తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టి.ఎ.ఎస్.కె) మరియు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్(ఎస్.సి.సి.ఎల్) వారు ఇస్తారు.ఈ క్రింద లింక్ ను క్లిక్ చేసి రిజిస్టర్ చేసుకొని జాబ్ మేళా కు 6 రెజ్యూమ్ లతో హాజరు కాగలరు. "హెచ్ టిటిపిఎస్://టిఐఎన్ వైయుఆర్ఎల్.సిఒఎం/ఎస్ ఎటిహెచ్ యుపిఎఎల్ఎల్ వైఎమ్ఇజిఎజెఒబిఎమ్ఇఎల్ ఎ" "హైదరాబాద్ వెళ్ళకుండానే మీ ఊర్లోనే ఉద్యోగం!"50 కి పైగా కంపెనీలు ఎ 3000 లకు పైగా ఉద్యోగ అవకాశాలు ఎ ఒకే వేదిక ద్వారా సద్వినియోగం చేసుకోవాలని సింగరేణి కాలరీస్ మరియు టాస్క్ టీం తెలియచేశారు .

# "నందిని" అవార్డ్సుకు ఆహ్వానం

**జాతీయ పద్య, సాంఘిక నాటక పోటీలు**

**శాస్త్రీయ జానపద నృత్య ప్రదర్శనలు**

**నాటక సమాజాల నుండి దరఖాస్తుల ఆహ్వానం**

**మిర్యాలగూడ సాంస్కృతిక కళాకేంద్రం ఆధ్వర్యంలో జాతీయస్థాయి పోటీలు**

**కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు రామావతారం, కృష్ణమూర్తి**



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోనే జాతీయస్థాయి పద్య సాంఘిక నాటక నాటిక పోటీల నిర్వహణలో ముందున్న మిర్యాలగూడ సాంస్కృతిక కళాకేంద్రం ఆధ్వర్యంలో ఈ సారి జరగనున్న పోటీలలో నందిని అవార్డ్స్-2025 పేరుతో జాతీయ పద్య నాటక సాంఘిక నాటిక పోటీలు, శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలను నిర్వహిస్తున్నామని మిర్యాలగూడ సాంస్కృతిక కళాకేంద్రం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరిమి రామావతారం, పులి కృష్ణమూర్తి, కోశాధికారి పుల్లంభట్ల వెంకట లక్ష్మీనారాయణశర్మ, ప్రచార కార్యదర్శి మామిడాల ఉపేందర్ లు తెలిపారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని వరసిద్ది వినాయక ఆలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పద్య నాటక సాంఘిక నాటిక పోటీలకు నవంబర్ 1 నుంచి నవంబర్ 30 వరకు దరఖాస్తులు నాటక సమాజాల నుండి స్వీకరించబడతాయని వారు తెలిపారు. వచ్చిన దరఖాస్తులలో ప్రాథమిక పరిశీలన 2026 జనవరిలో నిర్వహిస్తామన్నారు. జాతీయ పోటీలు మిర్యాలగూడ పట్టణంలోని కళాభారతిలో 7 మార్చి2026 నుండి 15 మార్చి2026 వరకు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. వచ్చిన దరఖాస్తులలో 8 పద్య నాటకాలు 8 సాంఘిక నాటకాల సంబంధించిన దరఖాస్తులను పరిశీలించి జనవరిలో పోటీలకు సంబంధించిన నోటిఫికేషన్ ఇస్తామన్నారు. ఈసారి నాటక, నాటిక పోటీలలో పాల్గొనే కళాకారులకు పారితోషికం రూ.50,000లు అందజేయన్నట్లు వారు తెలిపారు. అదేవిధంగా జాతీయ పద్య, నాటక ప్రథమ బహుమతి రూ 50,000లు, ద్వితీయ బహుమతి రూ.40, 000లు, తృతీయ బహుమతి రూ.30,000లు అందజేయన్నట్లు వారు తెలిపారు. సాంఘిక నాటిక పోటీలలో ప్రథమ బహుమతి రూ.25,000లు, ద్వితీయ బహుమతి రూ.20,000లు, తృతీయ బహుమతి రూ.15, 000లు అందజేసినట్లు తెలిపారు కళాకారులు అందరికీ సర్టిఫికెట్లు, ఉత్తమ పద్య, సాంఘిక నాటక పోటీలలో ప్రతిభ చూపిన వారికి నందిని అవార్డ్స్ అందజేయనున్నట్లు వారు వివరించారు. నూతన రచన నాటక, నాటికలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. ప్రాథమిక పరిశీలనలో న్యాయ నిర్ణేతల నిర్ణయం మేరకే నాటక, నాటికలు ఎంపిక చేయబడతాయని ఎలాంటి ఆక్షేపణలు అంగీకరించబడవన్నారు. సమావేశంలో సహాయ కార్యదర్శి ఆర్.వీర ప్రతాప్, సభ్యులు ఎల్లయ్య, సత్యనారాయణలున్నారు.

## విద్యుత్ వైర్ బెండల దొంగతనం చేసిన

# నేరస్థుల ముఠా అరెస్టు..



**మియాపూర్ అక్షిత ప్రతినిధి:** మియాపూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది తీవ్రంగా ప్రయత్నించి, నిర్మాణంలో ఉన్న (3) భవనాల నుండి విద్యుత్ వైర్లను (2) దొంగిలించిన నేరస్థులను (2) పట్టుకున్నారు.

18.10.2025న మియాపూర్‌లోని నాగార్జున ఎన్‌క్లేవ్‌లో ఒక భవనాన్ని నిర్మిస్తున్నానని, అక్కడ గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు గదుల్లో విద్యుత్ వైర్ కట్టలను ఉంచానని ఒక పిటిషనర్ నుండి ఫిర్యాదు అందింది. మునుపటి రోజు గదులకు తాళం వేసి రోజుల పని పూర్తయిన తర్వాత. తెల్లవారుజామున ఫిర్యాదుదారుల వాచ్‌మెన్ తెలియని నేరస్థులు గదుల తాళాలను పగలగొట్టి (25) విద్యుత్ వైర్ కట్టలను దొంగిలించారని గమనించాడు.నిందితుడు కన్నర్ల దిలీప్ కుమార్ బీహార్ రాష్ట్రానికి చెందినవాడు. అతను ప్రస్తుతం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా జీడిమెట్ల సూరారంలో నివసిస్తున్నాడు మరియు నిషాల్ కొరెల్కర్ మియాపూర్‌లోని హాఫీజ్‌పేటలో నివసిస్తున్నాడు. వారిద్దరూ గతంలో మియాపూర్, గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇలాంటి నేరాలకు పాల్పడ్డారు.

సులభంగా డబ్బు సంపాదించే ప్రయత్నంలో, నిందితులు దిలీప్ , నిషాల్ మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరియు చుట్టుపక్కల నిర్మాణంలో ఉన్న భవనాల నుండి విద్యుత్ వైర్ కట్టలను దొంగిలించాలని పథకం వేశారు.

వారి కార్యనిర్వహణ పద్ధతిలో భాగంగా, నిందితులు మోటార్ బైక్ లేదా అద్దెకు తీసుకున్న కారులో వివిధ ప్రాంతాలను వెతుకుతూ, ప్రత్యేకంగా నిర్మాణంలో ఉన్న ప్రదేశాలలో భద్రత లేకుండా కనిపించే వాటి కోసం వెతుకుతారు. తగిన లక్ష్యాన్ని గుర్తించిన తర్వాత, వారు ప్రాంగణంలోకి చొరబడతారు, సాధారణంగా ఇనుప రాడ్ తో ఆయుధాలు ధరించి, తాళాలు పగలగొట్టి, తాళం వేసిన గదులు లేదా నిల్వ ప్రాంతాలకు ప్రాప్యత పొందేవారు.

ప్రవేశించిన తర్వాత, నిందితులు విలువైన విద్యుత్ వైర్ కట్టలను దొంగిలించి, ఆ తర్వాత దొంగిలించబడిన సొత్తును మదీనాగూడ , సైబరాబాద్ లోని స్క్రాప్ దుకాణాలలో విక్రయించి, దొంగిలించబడిన వస్తువులను నగదుగా మార్చుకునేవారు.ఈ నిందితులు 2021 సంవత్సరం నుండి ఇటువంటి నేర కార్యకలాపాలకు పాల్పడుతున్నారని మరియు ఇలాంటి అనేక దొంగతనాల కేసుల్లో పాల్గొన్నారని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

నిందితుడు గతంలో మియాపూర్, గచ్చిబౌలి పరిమితుల్లో (8) నేరాలకు పాల్పడ్డాడు మరియు ఇప్పుడు నిందితుడు మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో (3) నేరాలకు పాల్పడ్డాడు. వారి వద్ద నుండి పోలీసులు ఒక పల్సర్ బైక్, రెండు స్విఫ్ట్ కార్లు వారి వద్ద స్వాధీనం చేసుకున్నారు

మియాపూర్ పోలీసు సిబ్బంది పి.శివ ప్రసాద్ ఎస్ ఎచ్ ఓ, జి రమేష్ నాయుడు డి ఐ, బి. నర్సింహారెడ్డి డి ఎస్ ఐ, హెచ్ సి లు. ఎన్.ప్రేమ్ కుమార్, సిహెచ్. యాదయ్య, డి.చంద్ర శేఖర్, పిసిలు ఎ.సుభాష్ చంద్రబోస్, ఎన్.పూర్ణ చందర్. ఇ.మల్లికార్జున్ మంచి పనికి తగిన ప్రతిఫలాన్ని అందజేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు . అలాగే బిల్డర్లు భవనంలోని నిల్వ గదుల వద్ద సి సి టి వి నిఘా మోషన్ యాక్టివేటెడ్ కెమెరాలు %౦% లైట్లను ఏర్పాటు చేయాలని మరియు భద్రతా సిబ్బందిని నియమించడంతో పాటు తగినంత భద్రతా ఏర్పాట్లను ఏర్పాటు చేయాలని మియాపూర్ పోలీస్ వారు సూచించారు.

## ఈనెల 29న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

**నేలకొండపల్లి ఎస్సై సంతోష్**




**ఖమ్మం/అక్షిత బ్యూరో :** పోలీస్ అమరవీరుల వారోత్సవాలు సందర్భంగా ఈనెల 29న నేలకొండపల్లి మార్కెట్ యార్డ్ లో ఏర్పాటు చేసే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని నేలకొండపల్లి ఎస్సై సంతోష్ కోరారు. రోడ్డు ప్రమాద బాధితులు తలసేమియా సికిల్ సెల్ డెంగ్యూ వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల సమయానికి బ్లడ్ బ్యాంకులో రక్త నిలువలు లేక పోవడం వల్ల మరణాలకు గురవుతున్నారని అలాంటి వారి సమస్యలను దృష్టిలో పెట్టుకొని రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని ఈ రక్తదాన శిబిరంలో రక్తదానం చేసి ప్రాణ దాతలుగా నిలవాలని సూచించారు. ఈ రక్తదాన శిబిరానికి మండల ప్రజలు యువతీ యువకులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## వృత్తి నైపుణ్య శిక్షణా సంస్థల నుండి దరఖాస్తుల ఆహ్వానం

**జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముజాహిద్**

**నవంబర్- 06 వరకు దరఖాస్తుల స్వీకరణ**



**ఖమ్మం/అక్షిత బ్యూరో :** తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ అర్హులైన మైనారిటీల కొరకు వివిధ రంగాలలో వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగ కల్పన కొరకు వృత్తి శిక్షణ సంస్థలను (ట్రైనింగ్ పార్ట్ నర్)లుగా నియమించుటకు గవర్నమెంట్ జాతీయ నైపుణ్య అభివృద్ధి సంస్థతో అనుసంధానం అయి ఉన్న వృత్తి శిక్షణ సంస్థల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎండి. ముజాహిద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.వృత్తి శిక్షణ సంస్థల రిజిస్ట్రేషన్ జాతీయ నైపుణ్య అభివృద్ధి సంస్థతో అనుసంధానం కాపీలు గడచిన 3 ఆర్థిక సంవత్సరాల ఇన్ కం ట్యాక్స్ రిటర్న్స్ ఆడిట్ రిపోర్ట్ లు కేంద్ర/రాష్ట్ర ఏజెన్సీ ల నుండి గడచిన 3 సంవత్సరాల కాలానికి సంబంధించి పొందిన కోర్సు పూర్తి చేసిన సర్టిఫికెట్లు/వర్క్ ఆర్డర్ కాపీలు, గడచిన సంవత్సర కాలానికి సంబంధించి ఉద్యోగ కల్పన క్రింద ఉద్యోగం పొందిన వారి సంబంధిత ధృవ పత్రాలు/ బ్యాంక్ స్టేట్ మెంట్ లు దరఖాస్తుతో పాటు జతపరచాలని మైనారిటీ సంక్షేమ అధికారి అన్నారు.

అర్హత గల వృత్తి శిక్షణ సంస్థలు తమ దరఖాస్తులను వి వెంకటాయపాలెం లోని కొత్త కలెక్టరేట్ ఆఫీస్ లో గల ఖమ్మం జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ రెండో అంతస్తు ఎస్-29 లో నవంబర్ 6వ తేదీ లోపు సమర్పించాలని ఇతర వివరాలకు 9704003002 మొబైల్ నెంబర్ ను సంప్రదించాలని మైనారిటీ సంక్షేమ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## కాలుష్యానికి కట్టడేది ?

**హెట్రో డ్రగ్స్ కంపెనీ యాజమాన్యాన్ని అరెస్ట్ చేయాలి**

**కాలుష్యాన్ని అరికట్టే చర్యలేవి ?**

**పటాన్చెరు పీసీబీ ఈఈని సస్పెండ్ చేయాలి**

**సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు**

**సిపిఎం ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ కు వినతి**



**మెదక్, అక్షిత బ్యూరో:** సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామం నల్లచెరువు కాలుష్యానికి కారణమైన హెట్రో డ్రగ్స్ యాజమాన్యంను వెంటనే అరెస్ట్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వంకు డిమాండ్ చేశారు.

సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ మాధురికి వినతి పత్రం ఇవ్వటం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమడుగు కాలుష్యంకు కారణం అయినా హెట్రో డ్రగ్స్ యాజమాన్యంపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వంను డిమాండ్ చేశారు. గత రెండు నెలలుగా రైతులు, ప్రజలు ఆందోళన చేస్తా ఉంటే పీసీబీ రెవిన్యూ అధికారులు కనీసం గ్రామాన్ని సందర్శించడం లేదని విమర్శించారు. కాలుష్య%శీ% పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న పిసీబీ ఈఈ ని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు 4 గొలుసు కట్టు చెరువులు క్రింద 5400 ఎకరాలు భూములు నష్టం జరుగుతుందన్నారు..గ్రామంలో దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ బోర్లు పాడవుతున్న, వందల సంఖ్యలో బర్లు, గోర్లు చనిపోతున్న అధికారులు స్పందించటం లేదన్నారు. త్రాగు నీళ్లు కూడా సరిగ్గా లేవన్నారు.రైతులు, ప్రజలు, వృతిదారులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కాలుష్య వ్యర్థ పదార్థాలు నక్క వాగు ద్వారా జిల్లాకు గుండెకాయలాంటి మంజీరా నది కూడ కాలుష్యం అవుతున్నదని అన్నారు. సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమ%శీ%లో సిపిఎ%శీ% పటాన్చెరు ఏరియా కార్యదర్శి బి.నాగేశ్వరరావు,రైతు సంగం జిల్లా అధ్యక్షులు రాజయ్య, నాయకులు నర్సింహారెడ్డి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## పిసిసి సారథికి ఆహ్వానం పలికిన పురోహితులు



**నిజామాబాద్, అక్షిత ప్రతినిధి :** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలో గల భీంగల్ మండలంలోని అతి పవిత్రమైన, అతి ప్రసిద్ధిగాంచిన, పురాతనమైన ఈనెల 5న, జరిగే భీంగల్ మండలంలోని శ్రీ నింబచల లక్ష్మీనరసింహస్వామి జాతరకు ముఖ్య అతిథిగా విచ్చేయాలని రాష్ట్ర పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను భీంగల్ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయ పురోహితులు పార్థసారథి ఆహ్వాన పత్రికను అందజేసి, జాతరకు తప్పకుండా రావాలని కోరారు.

# తీగల వంతెన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణం సకాలంలో నాణ్యతతో పూర్తి చేయాలి**

**రిటైనింగ్ వాల్ భూ నిర్వాసితులకు అందించే ప్రత్యామ్నాయ భూముల లేఔట్ అభివృద్ధిపై అవగాహన కల్పించాలి**

**మున్నేరు కేబుల్ బ్రిడ్జ్, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను పరిశీలించి భూ నిర్వాసితులకు కేటాయించే వెంచర్ అభివృద్ధి పనులపై సమీక్షించిన జిల్లా కలెక్టర్**





**ఖమ్మం/అక్షిత బ్యూరో :** ఖమ్మం మున్నేరు నదిపై చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ప్రాజెక్టులకు అవసరమైన భూ సేకరణ పూర్తి చేయడం పట్ల అధికారులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం నగరంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం కాల్వొడ్డు తీగల వంతెన పనులు మున్నేరు భూనిర్వాసితుల కోసం ఏర్పాటు చేస్తున్న లేఔట్ వెంచర్ పురోగతి పనులను క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం రిటైనింగ్ వాల్ భూనిర్వాసితులకు ఇచ్చే ప్రత్యామ్నాయ భూమి లేఔట్ అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ నిపుణుల కమిటీ చేసిన డిజైన్ ల ప్రకారం మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం పక్కాగా జరగాలని సకాలంలో పూర్తయ్యేలా చూడాలని అన్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు క్రింద సేకరించిన భూములను అభివృద్ధి చేసి మున్నేరు నది రిటైనింగ్ వాల్ భూ నిర్వాసితులకు అందించేలా రైతులతో చర్చలు జరపాలని తెలిపారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి స్థాయిలో నిర్మించాలని రెండు వైపుల నుంచి ప్రణాళికాబద్ధంగా పని జరగాలని అన్నారు.

రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ ప్రాధాన్యతతో పూర్తి చేయాలని ఏజెన్సీ అదనపు బృందాలు ఏర్పాటు చేసి పనులు చేయాలని అన్నారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ నిమిత్తం రైతులకు నిర్వాసితులకు అందించే 125 ఎకరాల ప్రత్యామ్నాయ భూముల లేఔట్ వెంచర్ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, వెంచర్ కు 100 మీటర్ల ప్రధాన రహదారి 40 మీటర్ల చొప్పున అంతర్గత రహదారి నగరంకు సులుభతరం చేసే విధంగా అదనంగా ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ప్రత్యేకంగా కల్పించే వసతులతో ఒక ప్రత్యేక వెంచర్ తో భూమి విలువ పెరిగి చుట్టు ప్రక్కల విస్తృతంగా అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ప్రజలకు అందించే భూములలో లేఔట్ అభివృద్ధి అంతర్గత రోడ్లు, కనెక్టివిటీ అంశాలు ప్రజలకు పూర్తి స్థాయిలో వివరించాలని అన్నారు.

ఖమ్మం నగరంలో మున్నేరుపై నిర్మించే కేబుల్ బ్రిడ్జి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని నిర్ణీత గడుపు లోపు ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వచ్చే విధంగా నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని అన్నారు. తీగల వంతెన నిర్మాణం వల్ల ఎవరు కూడా నష్ట పోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఆర్ అండ్ బీ ఎస్ఇ యాకుబ్ ఇఇ పవార్ ఆర్డీఓ నరసింహారావు ఇరిగేషన్ డిఇ రమేష్ రెడ్డి ఖమ్మం అర్బన్ రూరల్ మండల తహసీల్దార్లు సైదులు రాంప్రసాద్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా మహిళా ప్రాంగణం ఎంపిహెచ్ డబ్ల్యు విద్యార్థినుల క్యాపింగ్ మహోత్సవం

**ఏఎన్.ఎం విద్యతో ఎన్నో ఉపాధి అవకాశాలు**

**బి కళావతి బాయి**

**జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి**




**ఖమ్మం/అక్షిత బ్యూరో :** ఖమ్మం మహిళా ప్రాంగణంలో ఎంపి హెచ్ డబ్ల్యు విద్యార్థుల క్యాపింగ్ మహోత్సవం వైభవంగా జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని బి కళావతి భాయి జిల్లా సర్వజన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ నరేందర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బి కళావతి బాయి మాట్లాడుతూ నిరుపేద విద్యార్థినులకు మహిళా ప్రాంగణం అందిస్తున్న సేవలు అభినందనీయమని ఇక్కడ నర్సింగ్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ప్రతి ఏటా స్టేట్ ర్యాంకులు సాధించటం మన జిల్లాకు గర్వకారణంగా ఉందని ఈ ఏఎన్ఎం శిక్షణతో ప్రతి ఒక్కరికి మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయని వాటిని అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థినుల కు నర్సింగ్ వృత్తి ఎంత పవిత్రమైనదో చెప్పారు. ముఖ్య అతిథి ఎం నరేందర్ మెడికల్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఇక్కడ అభ్యసిస్తున్న విద్యార్థులకు భవిష్యత్తులో ఏదేని కాంట్రాక్ట్ / ఔట్సోర్సింగ్ ఉద్యోగ అవకాశాలు ఉంటే తప్పకుండా వారి పేరును పరిగణలోకి తీసుకుంటామని ఈ చదువుకునే రెండు సంవత్సరాలు కష్టపడి చదువుకుంటే రాబోయే భవిష్యత్తు సంవత్సరాలు జీవితంలో స్థిరపడి సుఖంగా జీవించవచ్చని కాబట్టి విద్యార్థులు కష్టపడి చదవాలని ఉద్బోధించారు. మరియొక అతిథిగా విచ్చేసిన డిపిహెచ్ఎన్ శేషు పద్మ మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి యొక్క పవిత్రతను లక్ష్యాలను వివరించి పేద ప్రజలు వచ్చే సర్వజన ఆస్పత్రిలో మంచి సేవలు చేయాలని పిల్లలకు హితవు చెప్పారు. ఇప్పుడు రానున్న కాలంలో ఏఎన్ఎం విద్యార్థులకు మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని కాబట్టి అందరూ వాటిని ఉపయోగించుకోవాలని ఆకాంక్షించారు. తర్వాత క్యాపింగ్ మహోత్సవం కార్యక్రమాలు ఈ అతిథుల సమక్షంలో వైభవం గా జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జిల్లా మహిళా ప్రాంగణాధికారిణి వేల్పుల విజేత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిబ్బంది సీనియర్ నాయకులు నందగిరి శ్రీనివాసరావు కార్యాలయ సిబ్బంది నాగ సరస్వతి స్పందన మల్లిక విజయ్ కుమార్ సుధీర్ సుకన్య లాలయ్య మౌనిక దుర్గారావు శాంతమ్మ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**50,000/-ఆర్థిక సహాయం చేసిన గంగి యాకయ్య**

**దుఃఖ సమయంలో అండగా నిలిచిన మానవతా మూర్తి**

**కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలిచి మంచి మనషులు**

**మానవతా విలువలకు నిలువెత్తు నిదర్శనం**





**నాగారం అక్షిత న్యూస్ :-** గ్రామీణ సమాజంలో మానవతా విలువలు, పరస్పర సహకారం ఇంకా జీవించినట్టు స్పష్టమైన నిదర్శనం నిలిచిన సంఘటన మండల పరిధిలోని ఈటూరు గ్రామంలో చోటుచేసుకుంది. పూర్తి వివరాలుల్లోకి వెళ్లితే ఈనెల 16న హఠాన్మరణం చెందిన వంగూరి వెంకటయ్య (టక్కులు) కుటుంబం ఆర్థికంగా, మానసికంగా తీవ్ర కష్టాల్లో ఉన్న సంగతి తెలిసిన వెంటనే మానవతా హృదయంతో ముందుకొచ్చిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గంగి యాకయ్య బాధిత కుటుంబానికి రూ.50,000/-ఆర్థిక సహాయం చేయడం ద్వారా సమాజంలోని ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలిచారు. కుటుంబం ఎదు ర్కొంటున్న దుఃఖం, పిల్లలు ఎదుర్కొంటున్న భవిష్యత్తు భయం, ఆదాయం లేకపోవడం వల్ల ఏర్పడిన ఆర్థిక దుర్దశ నేపథ్యంలో గంగి యాకయ్య స్పందించిన ఘటన గ్రామస్తులు ప్రశంసించారు. వెంకటయ్య ఆకస్మిక మరణం తర్వాత కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక షాక్ కు గురై, జీవనోపాధి విషయంలో అసహాయంగా మారిన విషయం తెలిసిందే. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు, కూలీ పనులపై ఆధారపడి జీవనం సాగించే కుటుంబాలు ఇలాంటి దుర్ఘటనల వలన పూర్తిగా దెబ్బతింటా యని సామాజిక విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సన్నిహితులు, గ్రామ పెద్దలు, విద్యావంతులు ముందుకు వస్తేనే అలాంటి కుటుంబాలకు భరోసా కలుగుతుందని, గంగి యాకయ్య లాంటి మానవతా దృక్పథం కలిగిన వ్యక్తి సాటివారికి ఆదర్శం చెప్పారని గ్రామస్తులు కొనియాడారు. స్థానికుల సమాచారం ద్వారా విషయం తెలిసిన వెంటనే ఇటువంటి ఆలోచన లేకుండా నేరుగా సహాయం పంపించడం ఆయన హృదయ విశాలతకు నిదర్శనమని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం వెంకటయ్య కుటుంబ ంలోని మహిళలు, పిల్లలు భవిష్యత్తు జీవనంపై ఆందోళనతో ఉన్న నేపథ్యంలో ఈ ఆర్థిక సహాయం వారికి తాత్కాలిక నిలయాన్ని, ధైర్యాన్ని ఇవ్వగలు గుతుందని నమ్మకం వ్యక్తం అయింది. వ్యక్తుల ఆర్థి క స్థితిని బట్టిని కాదు, మానవతా భావం ఉండటం గొప్ప ఆదర్శమూర్తి అని కొనియాడారు. సామాజిక బాధ్యతను నిర్వర్తించడం ప్రతి విద్యావంతుడి ధర్మం కాగా, ప్రజల సమస్యలు తెలుసుకొని తక్షణం స్పందించడం ద్వారా మానవతా విలువలకు గంగి యాకయ్య జీవం పోశారు. బాధలో ఉన్న కుటుంబాల వెన్నంటి నిలిచే వ్యక్తులే నేటి సమాజానికి నిజమైన మానవత వాదులని గ్రామ ప్రజలు కొనియాడారు. యాకయ్య ప్రాతినిధ్యం వహిస్తూ ఆయన సోదరుడు గంజి బిక్షపతి శు క్రవారం మృతుని కుటుంబ సభ్యులకు రూ. 50,000/-రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా గంగి బిక్షపతి మృతుని కుటుంబానికి ధైర్యం చెప్పి, భవిష్యత్తులోనూ తమ వంతు సహాయం ఇంకా అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు మీ కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. గంగి యాకయ్య ఆర్థిక సహాయం గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా పరస్పర ప్రేమాభిమానాలు, ఆనందంలోనూ కలిసి ఉండే సాంప్రదాయ విలువలు ఇంకా నిలిచి ఉన్నాయన్న నమ్మకాన్ని కలిగించింది. ఇలాంటి సేవా కార్యక్రమాలు యువతరానికి స్ఫూర్తి కావాలని, సామాజిక బాధ్యత పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన పెరగాలని, పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పేరాల రామచంద్రు, వంగూరి కుమార్, వంగూరి మహేష్, పేరాల వెంకటేష్, వంగూరి అవిలమల్లు, వంగూరి బాలరాజు, పేరాల ఉపేందర్, పేరాల రాజు, పేరాల సురేష్, వంగూరి ఎల్లయ్య, బోడ ముత్తయ్య, వంగూర గిరి, బుడతకాళ్ల దుర్గ స్వామి, బోడ కళ్యాణ్, బోడ దిలీప్, పేరాల మల్లయ్య మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థల తరలింపు పై కాంగ్రెస్ పార్టీ స్పష్టతనివ్వాలి

**కొడంగల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తిరుపతిరెడ్డికి కేడిపి జేఏసీ ఆధ్వర్యంలో మెమోరండం**

**విద్యాసంస్థల తరలింపును వెనక్కి తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు కొనసాగిస్తాం**



**కొడంగల్,అక్షిత ప్రతినిధి :** కొడంగల్ మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాలు తరలించవద్దని కెడిపి జేఏసీ కన్వీనర్ కోట్రికే లక్ష్మీనారాయణ, కో కన్వీనర్ గంటి సురేష్ కుమార్, ఎరన్ పల్లి శ్రీనివాస్, రమేష్ బాబు లు అన్నారు, శుక్రవారం కోడంగల్ లోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తిరుపతిరెడ్డి హాజరు కావడంతో కేడిపి జేఏసీ ఆధ్వర్యంలో మెమోరండం అందించారు, అనంతరం శంకుస్థాపన చేసి బయటకు వస్తున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తిరుపతిరెడ్డి ని కేడిపి జేఏసీ నాయకులు మీ వైఖరిని స్పష్టం చేయాలని కోరగా ఎటువంటి సమాధానం ఇవ్వకుండా బయలుదేరారు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కలుగచేసుకొవడంతో మాట మాట పెరిగి కొంత గందరగోళ వాతావరణం నెలకొంది, పోలీసులు కలగజేసుకోవడంతో గందరగోళం సద్దుమణిగింది,కే డీపీ జేఏసీ సభ్యులు మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాల తరలింపు పై కాంగ్రెస్ పార్టీ నాయకుల వైఖరి స్పష్టం చేయాలని నినాదాలు చేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోడంగల్ లో నిర్మించనున్న మెడికల్ కళాశాల, సమీకృత గురుకు లాల తరలింపును ఆపాలన్నారు, మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాలను ఎందుకు తరలిస్తున్నారు ప్రభుత్వం స్పష్టత నివ్వాలన్నారు, మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాల తరలింపుతో ఈ ప్రాంతం నష్టపోతు ందని ఆవేదన వ్యక్తం చేశారు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోడంగల్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాడనే ఆలోచనతో కోడంగల్ ప్రాంత ప్రజలు ఉన్నార న్నారు, కోడంగల్ ఎడ్యుకేషన్ హబ్ గా ఏర్పాటుచేసి ఈ ప్రాంత అభివృద్ధికి సహకరిం చాలన్నారు, విద్య, వైద్యానికి ఈ ప్రాంతం నోచుకోలేదని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాంతం విద్య, వైద్యనికి ఇతర ప్రాంతాలకు వెళ్ళరని భావించిన ప్రజలకు నిరాశ ఎదురయిందన్నారు, ఈ ప్రాంతం నుండి మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాలు తరలిస్తే చూస్తూ ఊరుకోమని పెద్ద ఎత్తున ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాల తరలింపు పై స్పష్టమైన వైఖరి చెప్పాలన్నారు, ఈ కార్యక్రమంలో కేడిపి జేఏసీ నాయకులు భీమరాజు, ఎర్రన్ పల్లి శ్రీనివాస్, యు రమేష్ బాబు, సూర్య నాయక్. మాసాని వెంకటయ్య. పవన్ లాహొటి. శాంత కుమార్. నర్మద కిష్టప్ప. ఉడిమేశ్వరం మధు. నవాజ్. పకీరప్ప. తుకారం. చిన్నయ్య. వికార్. తిరుమలేష్. భగవంత్ తదితరులు పాల్గొన్నారు.

### అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి:గోకినేపల్లి




**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వము తక్షణమే ఆదుకోవాలని సిపిఐ ఎంఎల్ మాస్ డిమాండ్ చేసింది.నష్టపోయిన రైతులను ప్రభుత్వము తక్షణమే ఆదుకోవాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.స్థానిక నీలం రామచంద్రయ్య భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నాలుగు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాల వలన మండలంలో వరి పత్తి రైతుల కు తీవ్రంగా నష్టం జరిగిందని రైతాంగం ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికి వచ్చేసరికి అకాలవర్షాల వలన తడిసి వరి నీళ్లలో తడిసి పోవడం జరిగిందని ఆయన అన్నారు. వర్షం కారణంగా దెబ్బతిన్న వరి,పత్తికి ఒక ఎకరానికి 20వేలు రూపాయలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మండలం లో పంట నష్టాన్ని అంచనా వేసి రైతాంగాన్ని ఆదుకోవాలని ఆయన అన్నారు. ఈ సమావేశం లో డివిజన్ కార్యదర్శి ఏ. వెంకన్న, డివిజన్ నాయకులు గంట శ్రీనివాస్, అమర్లపూడి శరత్ అఖిల భారత ఐక్య రైతు సంఘం డివిజన్ అధ్యక్షులు ఒగ్గు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సత్తుపల్లిలో తల్లి ఇద్దరు కూమారులు కలుపుమందు తాగి ఆత్మహత్యా యత్నం



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** సత్తుపల్లి పట్టణంలోని ద్వారకాపురి కాలనీకి చెందిన పఠాన్ సల్మా(28), భర్త సలీమ్... భార్యాభర్తల కుటుంబ కలహాల నేపథ్యంలో కలుపు మందు తాగి పఠాన్ సల్మా తన ఇద్దరు కూమారుల తో కలుపుమందు తాగించి తాను కూడా తాగి ఆత్మహత్యాయత్నం చేసింది... .సల్మా మరియు ఆమె ఇద్దరు కుమారులు నసీమ్(9), నయాన్(6) లను సత్తుపల్లి పట్టణంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం చేస్తున్నారు.సల్మా మరియు ఆమె చిన్న కుమారుడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు .... భర్త పట్టణంలోని ఓ ఆటో కంపెనీలో పని చేస్తుండగా, సల్మా ప్రైవేట్ జాబ్ చేస్తున్నట్లు సమాచారం.సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక


# విచ్చలవిడిగా వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి

**ఆదమరిస్తే ఆస్పత్రికే**

**భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు**

**పట్టించుకోని అధికారులు**



**నాంపల్లి, అక్షిత న్యూస్:** నాంపల్లి మండల పరిధిలోని పలు గ్రామపంచాయతీ పరిసరాల్లో వీధి కుక్కల సమస్య చాలా తీవ్రరూపం దాల్చింది. రాత్రి వేళల్లో వీధుల్లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు పాదచారులపై చిన్నపిల్లలపై దాడి చేస్తూ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయి. కొన్ని చోట్ల కుక్కల దాడికి చిన్నారులు గాయపడగా వృద్ధులు కూడా బయటకు వెళ్లడానికే భయపడుతున్నారు.

ప్రజలు పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ సమస్యకు పరిష్కారం కనిపించడం లేదు. ముఖ్యంగా చెత్త గుట్టలు మార్కెట్ ప్రాంతాలు మాంసం షాపులు హోటల్స్ వద్ద పెద్ద ఎత్తున వీధి కుక్కలు గుంపులుగా చేరిపోతున్నాయి. పశువైద్య శాఖ నిర్లక్ష్యం కారణంగా కుక్కల వంధీకరణ కార్యక్రమం నిలిచిపోయిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రతిరోజూ పిల్లలను స్కూల్‌కి పంపడమే భయంగా మారింది. అని తల్లిదండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు పాలనాధికారులను కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. కుక్కల సంఖ్య అదుపులోకి రాకపోతే రాబోయే రోజుల్లో పరిస్థితి మరింత తీవ్రమవుతుందనే అనుమానం వ్యక్తమవుతున్నాయి ప్రజల భద్రత కోసం వెంటనే చర్యలు తీసుకోవాలి అని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# అమరుల త్యాగం వెలకట్టలేనిది

**రక్తదానం మహాదానం**

**పోలీస్ అమరవీరులను స్మరిస్తూ కోరుట్లలో రక్తదాన శిబిరం**




**జగిత్యాల, అక్షిత ప్రతినిధి:** పోలీస్ అమరవీరుల సంస్మరణలో భాగంగా జిల్లా ఎస్పి అశోక్ కుమార్ ఐపిఎస్ ఆదేశాలమేరకు కోరుట్ల సర్కిల్ పోలీసుల ఆధ్వర్యలో ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ వారి సహకారాలతో కోరుట్ల పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మెట్ పల్లి డిఎస్పి రాములు ప్రారంభించారు. ఈ రక్తదాన శిబిరంలో పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు స్థానిక యువత, వ్యాపారస్తులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానము చేసిన వారికి డిఎస్పి ఎ రాములు చేతుల మీదుగా పండ్లను అందజేయడం జరిగింది.

ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ.. పోలీస్ అమరవీరులను స్మరిస్తూ రక్త దానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన అందరికి అభినందనలు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకై ప్రాణ త్యాగాలు చేసిన పోలీస్ అమరవీరులను స్మరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అయన అన్నారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం ద్వారా తాజాగా శరీరంలోకి కొత్త రక్తం ఉత్పత్తి అయ్యి ఆరోగ్యంగా ఉంటామని సూచించారు. కావున ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడడటానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ రక్తదాన శిబిరాలలో సుమారు 100 యూనిట్ల రక్తాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ వారికి అందజేయడం జరిగింది.అని డీస్పీ ఎ రాములు చెప్పారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ సురేష్, ఎస్ఐలు చిరంజీవి, శ్రీధర్ రెడ్డి, జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ మంచాల కృష్ణ, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్ ఇతరులు మా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# టిఎన్టియుసి రాష్ట్ర నాయకులు వేణుగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు

**ముఖ్యఅతిథిగా టిఎన్టియుసి రాష్ట్ర అధ్యక్షుడు పర్లపల్లి రవీందర్**



**చౌటుప్పల్,అక్షిత ప్రతినిధి:** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పేదల పెన్నిధి రాష్ట్ర నాయకులు వేణుగోపాల్ రెడ్డి బర్త్ డే,నకిరకంటి గణేష్ వివాహ వేడుకలలో ముఖ్యఅతిథిగా టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పర్లపల్లి రవీందర్ పాల్గొనడం జరిగింది అనంతరం తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన కొలరు వేణుగోపాల్ రెడ్డి బర్త్ డే వేడుకల్లో పాల్గొన్నారు,అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల స్కాలర్షిప్,ఫీజ్ రియంబర్స్మెంట్,గురుకుల వసతి గృహాలు ఎలాంటి సమస్యలున్న టీఎన్ఎస్ఎఫ్ ముందు ఉంటుందని వారు అన్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోస్కొండ వెంకటేష్,టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు మురళి, గణేష్, జయేందర్,వినయ్,మంగి మహేష్,వర్కాల వెంకటేష్,చిలువేరు రాజు తదితరులు పాల్గొన్నారు

# ఐద్వా డివిజన్ మహాసభలను జయప్రదం చేయండి




**సత్తుపల్లి , అక్షిత న్యూస్:** సత్తుపల్లి పట్టణంలో ఈనెల 27వ తారీకున జరిగే నాలుగవ డివిజన్ మహాసభలను స్థానిక కళాభారతిలో నిర్వహిస్తున్నట్టు మహిళా సంఘం రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి అన్నారు అనంతరం మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి హాజరవుతున్నారని అంతేకాకుండా 300 మంది ప్రతినిధులు ఈ సభకు వస్తారని అన్నారు. 27 తేదీన సత్తుపల్లి పట్టణంలో ర్యాలీ కూడా నిర్వహిస్తున్నట్లు సమాజంలో మహిళల పట్ల జరుగుతున్న హత్యలు మోసాలను అరికట్టాలని మహిళలకు తగ్గట్లు చట్టాన్ని అమలుపరచాలని సమాజంలో 60% మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని గ్రామస్థాయిలో మైక్రో ఫైనాన్స్ ఆగడాలను అరికట్టాలని ఇందుకు తగ్గట్టు గవర్నమెంట్ తగిన చర్యలు తీసుకోవాలని మహిళలకు కేరళ తరహా పాలసీ సేవలు చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి,ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు శీలం కరుణ, సత్తుపల్లి రూరల్ కార్యదర్శి జాజిరి జ్యోతి, సత్తుపల్లి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు పాకలపాటి ఝాన్సీ, చెరుకు రత్నకుమారి, కొమ్ము పుష్పవల్లి తదితరులు పాల్గొన్నారు

# కెఎం గ్రాండ్ హోటల్ ను ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఎం ఎల్ ఎ బీర్ల ఆయిలయ్య

**హాజరైన యాదగిరిగుట్ట ఎసిపి శ్రీనివాస్ నాయుడు**



**యాదగిరిగుట్ట అక్షిత న్యూస్:** యాదగిరిగుట్ట మండల కేంద్రంలో శుక్రవారం రోజు ఉదయం 11 గంటల 30 నిమిషాలకు కె ఎం గ్రాండ్ హోటల్ ను ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఆయిలయ్య రిబ్బన్ కట్ చేసి హోటల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా హోటల్ యజమాన్యం ఆరె వెంకటేష్ , జర్నలిస్టు రాష్ట్ర నాయకులు గుండు ముత్తయ్య గౌడ్ , వడాయిగూడెం మాజీ సర్పంచ్ గుండు మనీష్ గౌడ్ , పిఎన్ కృష్ణ గౌడ్ లు ప్రభుత్వ విప్ బీర్ల ఆయిలయ్యకు ఘన స్వాగతం పలికారు. అనంతరం హోటల్లోని మినీ ఫంక్షన్ హాల్ కు గుమ్మడి కాయ కొట్టి జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం హాల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా హోటల్ ప్రారంభానికి విచ్చేసిన ప్రతి అతిధికి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ ప్రభుత్వ విప్ మాట్లాడుతూ తెలంగాణ తిరుమల తిరుపతిగా ప్రసిద్ధిగాంచుతున్న యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి వారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు సుచి రుచికరమైన టిఫిన్ భోజనం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ గౌడ్ , వడాయిగూడెం గ్రామ మాజీ సర్పంచ్ రాసాల అమృత నరసింహ యాదవ్ , రాజ్ గోపాల పేట మాజీ సర్పంచ్ ఎల్ల రాజేంద్ర , మర్యాల మాజీ సర్పంచ్ చీర సత్యనారాయణ , వడాయిగూడెం బిఆర్ఎస్ గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి జక్కుల చంద్రయ్య యాదవ్ , దుర్గామాత ఉత్సవ కమిటీ అధ్యక్షులు బబ్బురి సుమన్ (డుమ్ము) , ప్రధాన కార్యదర్శి నీలాంజనేయులు గౌడ్ , సీఈఓ నోముల నరసింహ యాదవ్ , బిఆర్ఎస్ నాయకులు కోల సందీప్ , గుండు రవి తదితరులు పాల్గొన్నారు.